

## మెగా జాబ్ మేళాకు స్పందన

ప్రజాశక్తి-అరకులోయ :అరకులోయలోని ప్రభుత్వ ఆర్ఐటిఐలో శుక్రవారం ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో మెగా జాబ్ మేళా నిర్వహించారు. ఈ జాబ్ డ్రైవ్‌లో సుమారు 10 కంపెనీల నిర్వాహకులు పాల్గొని ఇంటర్వ్యూ నిర్వహించారు. ఈ డ్రైవ్లో 382 మంది నిరుద్యోగ యువత హాజరవ్వగా ఇందులో 132 మంది సెలెక్ట్ అయ్యారని జిల్లా నైపుణ్యాభివద్ధి అధికారి జీ.ప్రశాంత్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంప్లా యిమెంట్ అధికారి సంగీత, ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.




హాజరైన నిరుద్యోగులు

అంగన్వాడీ కేంద్రాలకు..

# సకాలంలో సరుకులు సరఫరా చేయాలి

-రీ సర్వే వేగవంతం చేయాలి
-జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్

ప్రజాశక్తి-పాడేరు : మొబైల్ డిస్పెన్సింగ్ యూనిట్ల ద్వారా అంగన్వాడీ కేంద్రాలకు నిర్దిష్టమైన గడువులోపు నిత్యావసర సరుకులు పంపిణీ చేయాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ నుండి ఐటిడిఏ ప్రాజెక్టు అధికారులు, రెవెన్యూ, ఐసిడిఎస్ అధికారులతో ఓటరు నమోదు, నిత్యావసర సరుకులు పంపిణీ, రైతు భరోసా, పి.ఎం. కిసాన్ మంజూరు, రీ సర్వేపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, క్షేత్ర స్థాయిలో సరుకుల పంపిణీ సమస్యలను సిడిపిఓలను అడిగి తెలుసుకున్నారు. డీలర్లు సరుకుల పంపిణీలో జాప్యం చేస్తే లైసెన్సులు రద్దు చేస్తామని హెచ్చరించారు. సిడిపిఓలు, ఐసిడిఎస్ సూపర్వైజర్లు, డీలర్లు, ఎం. డి.యూ ఆపరేటర్లతో తహాశీల్దారులు సమావేశం నిర్వహించాలని ఆదేశించారు.ఇంటింటి ఓటరు నమోదు సర్వే పక్కాగా నిర్వహించాలని సూచించారు. ఫారం 6, ఫారం 7, ఫారం 8 సేకరణ సక్రమంగా చేయాలని చెప్పారు. ఓటరు ఫోటోలు ఉంటే పక్కాగా నిర్ధారణ చేసుకుని తొలగింపు చర్యలు చేపట్టాలని సూచించారు. వి.ఆర్. ఓలు ఓటరు సర్వే ప్రక్రియలో పాల్గొనాలని తెలియజేసారు. వి.ఆర్ ఓల హాజరు వివిరాలను తప్పని సరిగా తహాశీల్దారులు సమర్పించాలని పేర్కొన్నారు. ఎస్సైన్డ్ భూముల వివరాలు సేకరణ, నమోదు ప్రక్రయపై తహాశీల్దారులు దృష్టి పెట్టాలన్నారు.అర్హత కలిగిన రైతులకు పి. ఎం. కిసాన్, రైతు భరోసా అందించాలని స్పష్టం చేసారు. అటవీ హక్కు పత్రాలు పొందిన రైతుల వివరాలను గిరి భూమి పోర్టల్‌లో సక్రమంగా నమోదు చేయాలని సూచించారు. మ్యుటేషన్ ప్రక్రియలో లోపాలు లేకుండా తగిన జాగ్రత్తలు పాటించాలని చెప్పారు. భూముల రీసర్వే వేగంగా పూర్తి చేయాలని తహాశీల్దారులకు నిర్దేశించిన లక్ష్యాలను సాధించాలన్నారు.ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ జె.శివ శ్రీనివాసు, పాడేరు ఐటిడిఏ పిఓ వి. అభిషేక్, రంపచోడవరం ఏపి ఓ.సూరజ్ గనోరే, డి ఆర్ ఓ అంబేద్కర్, జిల్లా వ్యవయాధికారి ఎస్.బి. ఎస్.నంద్, కలక్టరేట్ పరిపాలనాధికారి చిన్ని కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

### రక్తదానంతో ప్రాణదానం

పాడేరు:- రక్తం దానం చేసి ప్రాణదాతలు కావాలని ప్రాణాపాయంలో ఉన్న వారికి తోడ్పాటు అందించాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ పిలుపునిచ్చారు. రక్తదానం చేసి మానవత్వాన్ని చాటుకోవాలని కోరారు. ఐటీడీఏ వద్ద రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని జిల్లా కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రక్తం దానం చేయడంతో ఎటువంటి అనారోగ్య సమస్యలు తలెత్తవని తెలిపారు. రక్తం ఒక ప్రాణాన్ని కాపాడుతుందని గుర్తు చేశారు. ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ పాడేరు శాఖ స్వచ్ఛందంగా సేవలు అందిస్తుందని, వారికి సహకరించాలని కోరారు. స్థానిక ఆర్టీసీ ఉద్యోగులు రక్తదానం చేయడంతో వారిని అభినందించారు. స్థానిక ఆర్టీసీ ఉద్యోగులు శుక్రవారం ఐటీడీఏ వద్ద నిర్వహించిన ఈ రక్తదాన శిబిరంలో రక్తాన్ని దానం చేశారు. 16 యూనిట్లు రక్తాన్ని సేకరించడం జరిగిందని రెడ్ క్రాస్ సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో జెసి శ్రీనివాసు, డి ఎం ఎండ్ హెచ్ఓ జమాల్ బాషా, ఆర్టీసీ డిఎం శ్రీనివాసు, డిసిహెచ్ఓ, జిల్లా ఆస్పత్రి సూపరిండెంట్ డాక్టర్ కృష్ణారావు, డాక్టర్ రూపకల, రెడ్ క్రాస్ సభ్యులు జయలక్ష్మి, సూర్యారావు, సుబ్రహ్మణ్యం, గౌరీ శంకర్, సంజీవరావు కోఆర్డినేటర్ లోహితస్, సిబ్బంది రాజు బాబు,సతీష్,అప్పారావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బాధితులు

# వరద సాయం స్వాహా

- వాలంటీరు చేతివాటం
- సొమ్ము ఇప్పించాలని బాధితుల వేడుకోలు

ప్రజాశక్తి-విఆర్.పురం

వరద బాధిత కుటుంబాలకు ప్రభుత్వం ఒక్కో కుటుంబానికి రూ.2వేలు చొప్పున అందించిన వరద సాయం డబ్బులు తమకు పూర్తిగా ఇవ్వకుండా గ్రామ వాలంటీరు స్వాహా చేసినట్లు బాధితులు ఆరోపించారు. గత నెలలో సంభవించిన గోదావరి వరదలు సందర్భంగా ముంపునకు గురైన గ్రామాల్లో ప్రతి కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం రూ.2వేలు ఆర్థిక సాయం ప్రకటించిన విషయం విధితమే. అయితే మండలంలోని రామవరం గ్రామ పంచాయితీ పరిధి రామవరంపాడు గ్రామంలో వరద బాధితులకు రూ.2వేలు చొప్పున ఇవ్వాల్సిన డబ్బులు వాలంటీరు పూర్తి స్థాయిలో ఇవ్వలేదని ఆ గ్రామస్తులు శుక్రవారం మీడియాకు తెలియజేశారు. కొందరికి రూ.1500, కొందరికి రూ.1000, మరికొందరికి పైసా కూడా ఇవ్వలేదని తెలిపారు. గ్రామానికి చెందిన పులి చంద్రారావుకు రూ.1500, మానే రమేష్, మినప రమేష్‌కు వెయ్యి రూపాయలు చొప్పున ఇవ్వగా, మడివి దేవయ్యకు అసలు ఇవ్వలేదని తెలిపారు. దీనిపై అడగ్గా, మీకు అంతే వస్తాయని చెప్పి గ్రామ వాలంటీరు పులి రమ్య, ఆమె భర్త ధర్మారావు ఇవ్వలేదని వాపోయారు. తమకు పూర్తిగా వరద సహాయం ఇప్పించాలని వారు అధికారులకు విజ్ఞప్తి చేస్తున్నారు. అలాగే వాలంటీరు తమకు ఏ సమాచారం ఇవ్వడం లేదని ఆరోపించారు. వరద సాయం ఇవ్వకుండా స్వాహా చేసిన వాలంటీరుపై చర్యలు తీసుకోవాలని, ఆమెను విధుల నుండి తప్పించి, కొత్త వాలంటీరును నియమించాలని గ్రామస్తులు కోరారు.

# పాడేరులో భారీ వర్షం

-జన జీవనానికి ఆటంకం
- రహదారులు జలమయం




పాడేరులో కురుస్తున్న వర్షం



తడిసిపోతున్న చిరు వ్యాపారుల దుకాణాలు

ప్రజాశక్తి-పాడేరు టౌన్: అల్లూరి జిల్లా కేంద్రం పాడేరులో శుక్రవారం భారీ వర్షం కురిసింది. మన్యంలో ఆయా మండలాల్లో ఒక మోస్తారు నుంచి భారీ వర్షం కురిసింది. పాడేరులో ఉదయం నుంచి మధ్యాహ్నం మూడున్నర గంటల వరకు ఎండ వాతావరణం కొనసాగి, ఆ తర్వాత వాతావరణం మారి పోయింది. నాలుగు గంటల తర్వాత ఒక్కసారిగా వాతావరణం మారింది. ఆకాశం మేఘావృతమై భారీ వర్షం కురిసింది. సుమారు రెండు గంటలసేపు కురిసిన వర్షానికి పాడేరు పట్టణం తడిచి ముద్దయింది. దీంతో పాడేరులోని రోడ్లన్నీ చిత్తడిగా మారి, జనజీవనానికి తీవ్ర అంతరాయం ఏర్పడింది. చిరు వ్యాపారులు, వీధి వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. వాహనదారులు వాహనాలను ఎక్కడి కక్కడే నిలిపి వేశారు. పలువురు వాహనదారులు లైట్లు వేసుకుని ప్రయాణాలు సాగించారు. అనంతగిరి మండలంలోని పలు చోట్ల వర్షం కురిసింది. వర్షాలకు రోడ్లు బురదమయంగా మారడంతో వాహనదారులు అవస్థలు పడ్డారు. రోడ్లన్నీ చిత్తడిగా మారి, జనజీవనానికి తీవ్ర అంతరాయం ఏర్పడింది.



మాట్లాడుతున్న ఆదివాసీ గిరిజన సంఘం నేతలు

ఆశ్రమ పాఠశాలల్లో..

### ఉపాధ్యాయులను నియమించాలి

ప్రజాశక్తి-ముంచింగిపుట్టు:స్థానిక ఆదివాసి గిరిజన సంఘం కార్యాలయం వద్ద ఆ సంఘం మండల అధ్యక్షుడు ఎంఎం శ్రీను, కార్యదర్శి కొర్ర నర్సయ్యలు విలేకరులతో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా అధ్యక్ష కార్యదర్శులు ఎంఎం శ్రీను, కొర్ర నర్సయ్య మాట్లాడుతూ, మండలంలో గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో సబ్జెక్టులకు విద్యా బోధన అందించే ఉపాధ్యాయులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. మండలంలో పదవ తరగతి ఉత్తీర్ణత శాతం దిగజారిందని తెలిపారు. ఇటీవల గిరిజన సంఘం పర్యటనలో భాగంగా జోలపుట్టు గిరిజన సంక్షేమ ఆశ్రమ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో ఆరు సబ్జెక్టులకు ఒక్క ఉపాధ్యాయుడే ఉన్నాడని, ఆరవ తరగతి నుండి పదవ తరగతి వరకు అన్ని తరగతుల పాఠాలు ఒక్క ఉపాధ్యాయుడు బోధిస్తున్నాడన్నారు.ఐటీడీఏ పిఓ, కలక్టర్‌లు ఉపాధ్యాయుల నియామకాల పట్ల ప్రత్యేక చొరవ చూపాలన్నారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం కమిటీ సభ్యుడు కామరాజు పాల్గొన్నారు.



ప్రమాణ స్వీకారం చేస్తున్న సర్పంచ్ పాంగి దుర్జు, చిత్రంలో నర్సింగరావు తదితరులు

# సర్పంచ్ దుర్జు ప్రమాణ స్వీకారం

ప్రజాశక్తి -సీలేరు

జీకే వీధి మండలం సీలేరు మేజర్ పంచాయతీ సర్పంచ్‌గా ఎన్నికైన పాంగి దుర్జు శుక్రవారం ప్రమాణ స్వీకారం చేశారు. రిటర్నింగ్ ఆఫీసర్ సత్యనారాయణ దుర్జు చేత ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం సర్పంచ్ పాంగి దుర్జుకు వైసీపీ, కాంగ్రెస్, ఇతర నాయకులు పూలమాలలు వేసి దుస్సాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన రాష్ట్ర మెడికల్ కౌన్సిల్ సభ్యులు తమర్బ నర్సింగరావు మాట్లాడుతూ సీలేరులో పార్టీలకతీతంగా వైసిపి అభ్యర్థిని గెలిపించడం ప్రజల గొప్పతనమన్నారు. ముఖ్యమంత్రి అభివృద్ధి కార్యక్రమాలు అభ్యర్థుల గెలుపునకు నాంది అని పేర్కొన్నారు. సీలేరు పంచాయతీ అభివృద్ధికి తమ వంతు సహాయ సహకారాలు ఉంటాయని హామీ ఇచ్చారు. మాజీ సర్పంచ్ పరదేశి అడుగుజాడల్లో ప్రస్తుత సర్పంచి దుర్జు నడిచి ప్రజలు మనల్ని పొందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ పిల్ల సాంబమూర్తి, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్, ఉప సర్పంచ్ కె.వల్లి ప్రసాద్, కాంగ్రెస్ నాయకులు కారే శ్రీనివాస్, ఎం.సత్తిబాబు, వి.అప్పారావు, వైసిపి నాయకులు బలరాం, వెంకట్రావు, బుజ్జి, స్వర్ణలత పాల్గొన్నారు.

# వార్డెన్ల నియామకాలపై ఫిర్యాదు

ప్రజాశక్తి-పాడేరు

ఏజెన్సీ 11 మండలాలలో గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల వసతి గృహాలలో నిబంధనలకు విరుద్ధంగా వార్డెన్, మేట్రిన్ నియామకాలు చేపడుతున్నారని పెదబయలు జడ్పిటిసి కూడా బొంజు బాబు, గిరిజన సమాఖ్య జిల్లా కార్యదర్శి కూడా రాధాకృష్ణ జిల్లా కలెక్టర్కు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు శుక్రవారం స్పందన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదును అందించారు ఈ సందర్భంగా విలేకరులతో వారు మాట్లాడుతూ, గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల వసతి గృహాలలో డిప్యూటీ వార్డెన్, మెట్రిన్‌లను ప్రభుత్వ నియమ నిబంధనల ప్రకారం నియమించాలని డిమాండ్ చేశారు.గత ఏడాది విద్యా సంవత్సరం నుంచి మూడు నెలల డిప్యూటీ వార్డెన్ నియామకాలతో గిరిజన సంక్షేమ ఆశ్రమ వసతి గృహాల నిర్వహణ అస్తవ్యస్తంగా మారిందని వివరించారు విద్యార్థులకు పౌష్టికాహారం అందలేదన్నారు.2022- 23 విద్యా సంవత్సరంలో విద్యార్థుల పరీక్ష ఫలితాలపై కూడా ప్రభావం కనిపిస్తోందని తెలిపారు.కొన్ని ఆశ్రమ పాఠశాలలో బిఈడి అసిస్టెంట్లు, లాంగ్వేజ్ పండిట్‌లు డిప్యూటీ వార్డెన్, మెట్రిన్లుగా బాధ్యతలు నిర్వర్తించడంతో బోధనకు అవాంతరం కలుగుతుందని అన్నారు ప్రభుత్వ నియమ నిబంధనలకు విరుద్ధంగా హెచ్ఎం లకు, బిఈడి అసిస్టెంట్లకు కొన్ని ఆశ్రమ పాఠశాలలకు డిప్యూటీ వార్డెన్/మెట్రిన్ బాధ్యతలు అప్పగిస్తున్నారని ఆరోపించారు.

### నేడు అనంతగిరి మండల సమావేశం

ప్రజాశక్తి అనంతగిరి

మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం ఈనెల 26న నిర్వహిస్తున్నట్లు స్థానిక ఇన్చార్జి ఎంపీడీవో ఏ వి వి కుమార్ తెలిపారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఉదయం 10గంటలకు హాజరు కావాలని కోరారు. గత సమావేశంలో సమస్యలపై సుదీర్ఘ చర్చ ఉంటుందని దానికి అనుగుణంగా అధికారులు సిద్ధంగా రావాలన్నారు.



పిఆర్‌టియు నూతన కమిటీ సభ్యులు

### పిఆర్‌టియు నూతన కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి-దుంబ్రిగుడ: మండల కేంద్రంలో పి ఆర్ టి యు అల్లూరి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్ అప్పలరాజు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు కే రమేష్ కుమార్ సమక్షంలో శుక్రవారం ఆ సంఘం మండల కమిటీ నూతన కార్యవర్గం ఎన్నికైంది. గౌరవ అధ్యక్షుడిగా వి.రాము, అధ్యక్షుడిగా లక్ష్మయ్య, ప్రధాన కార్యదర్శిగా జి.రాంప్రసాద్ ఏకగ్రీవంగా ఎన్నికవ్వగా అసోసియేట్ అధ్యక్షుడుగా ఎస్.రాజు, ఉపాధ్యక్షుడిగా కె.మధుసూదన్‌రావు, మహిళ ఉపాధ్యక్షురాలిగా ఎస్.మహాలక్ష్మి, మహిళ కార్యదర్శిగా పి.సరోజిని, మండల కార్యదర్శులుగా జి.కామరాజు, ఎం.అర్జున్‌రావు, కోశాధికారిగా పి.సింహాద్రితోపాటు మండల కమిటీ సభ్యులుగా పలువురిని ఎన్నుకున్నారు. అనంతరం నూతన అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాట్లాడుతూ, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని వారు చెప్పారు.



ఎస్‌టి కమిషన్ చైర్మన్‌ను అభినందిస్తున్న టిడబ్ల్యుటియు నాయకులు

### విద్యారంగ సమస్యలపై టిడబ్ల్యుటియు వినతి

ప్రజాశక్తి-పాడేరు టౌన్: విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని ఎపి గిరిజన సంక్షేమ ఉపాధ్యాయ సంఘం నాయకులు ఎస్‌టి కమిషన్ చైర్మన్ డివిజి శంకరరావును, కమిషన్ సభ్యులు కె.రామలక్ష్మిని కలసి వినతి పత్రం అందజేశారు. శుక్రవారం విజయనగరంలో టిడబ్ల్యూటియు నాయకులు ఎస్ టి కమిషన్ చైర్మన్‌ని మర్యాదపూర్వకంగా కలసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా గిరిజన విద్యకు సంబంధించిన పలు అంశాలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. జిటిడబ్ల్యూ ఆశ్రమ పాఠశాలల్లోని నెలకొన్న వివిధ సమస్యలను, గిరిజన విద్యకు అహర్నిశలు కృషి చేస్తున్న ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని కోరారు. పిఇటి, పండిట్ లను అప్ గ్రేడ్ చేయాలని, డిప్యూటీ డిఇఓ పోస్టులను సీనియర్ హెచ్‌ఎంలతో భర్తీ చేయాలని, గిరిజన సంక్షేమ ఉపాధ్యాయులకు ప్రత్యేక సర్వీస్ రూల్ రూపొందించాలని, వెల్ఫేర్, ఎడ్యుకేషన్ లను సపరేట్ చేసి పర్యవేక్షణ అధికారులుగా టిడబ్ల్యూ ఎంఇఓలను నియమించాలని కోరారు. దీనిపై ఆయన స్పందిస్తూ తన పరిధిలో ఉన్న సమస్యలను సత్వరమే పరిష్కరించి, మిగిలిన వాటిని ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్ళనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టిడబ్ల్యూటియు రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆర్.సూర్యనారాయణ, జి.శేషగిరిరావు, కార్యదర్శి సుబ్బారావు, అల్లూరి జిల్లా అధ్యక్షుడు కె.నీలకంఠం, నాయకులు రామారావు, నారాయణ, నందో, భాస్కరరావు, రాజారావు, శేఖర్, పాల్గొన్నారు.

# బడి బయట పిల్లలను బడిలో చేర్పించేందుకు చర్యలు

ఐటిడిఎ పిఒ సూరజ్ గనోరే ఆదేశం

ప్రజాశక్తి-రంపచోడవరం

రంపచోడవరం, చింతూరు డివిజన్ల పరిధిలో బడి బయట ఉన్న పిల్లలను ప్రత్యేక సర్వే చేసి గుర్తించి వారిని సంబంధిత పాఠశాలలో చేర్పించేందుకు చర్యలు చేపట్టాలని రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి సూరజ్ గనోరే సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఐటిడిఏ ప్రాజెక్ట్ అధికారి తన ఛాంబర్‌లో గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్, ఎటిడబ్ల్యుఒ, 11 మండలాల ఎంఇఓలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా పిఒ సూరజ్ గనోరే మాట్లాడుతూ ఎన్ని పాఠశాలలు ఉన్నాయి, ఎంత మంది విద్యార్థులు, ఉపాధ్యాయులు, వాలంటీర్లు ఉన్నది మండలాల వారిగా ఆరా తీశారు. జగనన్న విద్యా కానుకల కిట్లు ఎంత మంది విద్యార్థులకు పంపిణీ చేశారు, ఇంకా ఎంతమందికి అందజేయవలసి అడిగి తెలుసుకున్నారు. ప్రతి మండలంలో ఎంతమంది బడి బయట పిల్లలు ఉన్నది, దీర్ఘకాలికంగా ఆబ్సెంట్ ఎంత మంది విద్యార్థులు ఉన్నది ఆరా తీశారు. ఆధార్ కార్డు సమస్యలు లేకుండా ఉన్న విద్యార్థులకు చైల్డ్ ఇన్ఫోసిస్‌లో రిజిస్ట్రేషన్లో పొందుపరచాలని, ఆధార్ కార్డులు సమస్యలున్న వారిని దగ్గర్లో ఉన్న ఆధార్ సెంటర్లకు తీసుకెళ్లి అప్డేట్ చేయించాలని సంబంధిత అధికారులను ఆయన ఆదేశించారు. గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలు, జిపిఎస్ పాఠశాలలు, మండల పరిషత్ పాఠశాలు, ప్రైవేట్ పాఠశాలలు ఎన్ని ఉన్నవి మండలాల వారీగా అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో సిలబస్ నిబంధన ప్రకారం పూర్తి చేయాలని, సిలబస్ పూర్తికాని ఎడల ప్రత్యేక క్లాసులు తీసుకోవాలని సూచించారు. లెసన్ ప్లాన్ ప్రకారం విద్యార్థులకు పాఠాలు బోధించాలన్నారు. నాడు-నేడు ఫేజ్-2 ద్వారా ఎన్ని పనులు మంజూరైనవి, ఎన్ని పూర్తయినవి తెలుసుకొని, చేసిన పనులకు బిల్లులు అప్లోడ్ చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ జాన్‌రాజ్, ఎటిడబ్ల్యుఒ హాసిని, మండల విద్యాశాఖాధికారులు మల్లేశ్వరరావు, ఎంవివి సత్యనారాయణ దొర, ఎస్.బాలుదొర, కెఆర్‌పి కుమార్, గిరిజన సంక్షేమ శాఖ కార్యాలయ సూపరింటెండెంట్ బి.కిషోర్ ప్రత్యక్షంగా, వివిధ మండలాలకు చెందిన ఎంఇఓలు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న ఐటిడిఎ పిఒ సూరజ్ గనోరే, గిరిజన సంక్షేమశాఖ డీడీ జాన్‌రాజ్, అధికారులు

### డ్రాపౌట్స్ విద్యార్థులను పాఠశాలల్లో చేర్పించాలి

రాజవొమ్మంగి : 5 నుండి 18 సంవత్సరాలు వయసు కలిగిన పాఠశాల, కళాశాల డ్రాపౌట్స్ విద్యార్థులను తిరిగి విద్యాలయాల్లో చేర్పించే విధంగా చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో లోకుల యాదగిరీశ్వరరావు ఆదేశించారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో శుక్రవారం వెల్ఫేర్, ఎడ్యుకేషన్ అసిస్టెంట్లు, గ్రామ వాలంటీర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓలు కె.తాతబ్బాయిదొర, సూరారెడ్డి మాట్లాడుతూ డ్రాప్ అవుట్‌గా ఉన్న విద్యార్థులు ఇళ్లకు వెళ్లి వారి తల్లిదండ్రులకు విద్యార్థులకు అవగాహన కల్పించి వారు తిరిగి విద్యాలయాల్లో జాయిన్ అయ్యేవిధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఇన్‌ఛార్జి ఇఒపిఆర్‌డి, సచివాలయ వెల్ఫేర్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్‌లు, వాలంటీర్లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపిడిఒ యాదగిరీశ్వరరావు

# జీవనోపాధి యూనిట్ల సందర్శన

ప్రజాశక్తి-రంపచోడవరం

అనకాపల్లి జిల్లా డిఆర్‌డిఎ పథక సంచాలకులు లక్ష్మీపతి ఆధ్వర్యంలో ఆ శాఖ సిబ్బంది రంపచోడవరం ఐటిడిఎ పరిధిలోని గ్రామీణ వికాస కేంద్రం, వైఎస్ఆర్ క్రాంతి పథం ఆధ్వర్యాన నిర్వహిస్తున్న వివిధ జీవనోపాధి యూనిట్లను శుక్రవారం సందర్శించారు. రైతు ఉత్పత్తిదారుల సంఘాలతో నిర్వహిస్తున్న తాళ్ళపాలెం గ్రామంలోని ఫత్తెనింగ్ ఫార్మర్ యూనిట్, హేచరీ, పందిరిమామిడిలోని బ్రీడర్ ఫార్మర్ యూనిట్, సువర్లవాడలోని ఫత్తెనింగ్ ఫార్మర్ యూనిట్, ఫీడ్ మిల్లు, ఎంఎస్ఎంఇ యూనిట్లు, వెలుగు, ఐటిడిఎ ఆధ్వర్యంలో నడుపుతున్న మారేడుమిల్లి రైతు ఉత్పత్తిదారుల పసుపు యూనిట్ తదితర యూనిట్లను సందర్శించి పరిశీలించారు. కోడి పిల్లల పెంపకం యూనిట్లు రైతులకు అతి తక్కువ ధరకు అందించినట్లు అధికారులు తెలిపారు. సువర్లవాడలో కోడిపిల్లల పెంపకం యూనిట్లు 50 నెలకొల్పి కోడి పిల్లల మేత, ఇతర పరికరాలను రైతులకు అందించడం జరిగిందని పేర్కొన్నారు. కోళ్ళ దాణా కోసం ఫీడ్ మిల్లును ఏర్పాటు చేసి దాణా ఉత్పత్తి చేస్తున్నట్లు చెప్పారు. పందిరిమామిడిలో బ్రీడర్ ఫార్మర్ యూనిట్ ద్వారా గుడ్లు పొదిగించి కోడి పిల్లలను ఉత్పత్తి చేయుట జరుగుతుందని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో వెలుగు ఎపిడి శ్రీనివాస్, డిఆర్‌డిఎ, పిపిఎం, ఎపిఎంలు పాల్గొన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న అనకాపల్లి జిల్లా డిఆర్‌డిఎ అధికారులు, అల్లూరి వెలుగు ఎపిడి తదితరులు

## స్పందనకు 92 వినతులు



వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్, ఇతర అధికారులు

ప్రజాశక్తి-పాడేరు: సమీకృత గిరిజనాభివృద్ధి సంస్థలో శుక్రవారం నిర్వహించిన జగనన్నకు చెబుదాం స్పందనకు 92 ఫిర్యాదులు వచ్చాయి. జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్, జాయింట్ కలెక్టర్ జె. శివ శ్రీనివాసు, ఐటిడి ఎ పి.ఓ. వి.అభిషేక్ లతో కలిసి వివిధ మండలాల నుండి వచ్చిన అర్జీదారుల నుండి ఫిర్యాదులు స్వీకరించారు. స్పందనలో స్వీకరించిన ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. హుకుంపేట మండలం తీగలవలస పంచాయతీ కరకపుట్టు గ్రామస్తులు జి.అప్పారావు, జి. త్రినాథరావు తదితర రైతులు పోడు భూములకు పట్టాలు మంజూరు చేయాలని వినతిపత్రం సమర్పించారు. అనంతగిరి మండలం గ్రామస్థుడు భార్గవ విజయ కుమార్, భాషా వాలంటీర్ ఉద్యోగం కోసం దరఖాస్తు చేశారు. చింతపల్లి మండలం బలపం పంచాయతీ కుడుమసారి గ్రామానికి అంగన్వాడీ భవనం మంజూరు చేయాలని ఉప సర్పంచ్ పి. కామరాజు దరఖాస్తును అందజేసారు. పాడేరు మండలం వంజంగి గ్రామ నుండి బుర్రమామిడి గ్రామానికి తారురోడ్డు మంజూరు చేయాలని సర్పంచ్ వంతాల బొంజుబాబు అర్జీపత్రంలో కోరారు. జి.కె. వీధి మండలం గుమ్మిరేవుల పంచాయతీ చింతగుప్ప గ్రామానికి మంజూరు చేసిన గ్రావెల్ రోడ్డు నిర్మాణం పూర్తి చేయాలని వి.రామచంద్ర వినతిపత్రం సమర్పించారు. హుకుంపేట మండలం మలివలసపుట్టు ప్రాథమిక పాఠశాల భవనానికి మరమ్మతులు చేయాలని, పాఠశాలకు ప్రహరీ గోడ మంజూరు చేయాలని సర్పంచ్ ఎస్. చంటమ్మ వినతి పత్రం సమర్పించారు. పాడేరు మండలం డబ్బపుట్టు గ్రామానికి తాగునీటి సదుపాయం కల్పించాలని గ్రామస్తులు. ఎం. కొండబాబు, ఆర్. రాంబాబు అర్జీని. అందజేసారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ పి.అంబేద్కర్, ఐటిడి ఏ సహాయ ప్రాజెక్టు అధికారి ఎం.వి.ఎస్. ప్రభాకర్, గిరిజన సంక్షేమ శాఖ ఇ. ఇ. లు డి.వి.ఆర్. ఎం.రాజు, కె.వేణు గోపాల్, పంచాయతీ రాజ్ ఇఇలు టి.కొండయ్యపడాల్, కె. లావణ్య కుమార్, జిల్లా పంచాయితీ అధికారి కొండల రావు, సర్వే సహాయ సంచాలకులు వై. మోహన రావు పాల్గొన్నారు.

## రాయితీపై రాజ్మా విత్తనాలు పంపిణీ చేయండి



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న సర్పంచ్

ప్రజాశక్తి- డుంబ్రిగుడ: మండలంలోని గసభ పంచాయితీ గ్రామాల్లో రైతులకు అదనంగా సబ్సిడీ రాజ్మా విత్తనాలు పంపిణీ చేయాలని కోరుతూ స్థానిక ఆ పంచాయతీ సర్పంచ్ పి.సునీత, మాజీ సర్పంచ్ సురేష్ కుమార్, వార్డు సభ్యుడు పి సత్యనారాయణ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ కి శుక్రవారం జరిగిన స్పందన కార్యక్రమంలో వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇప్పటికే రెండు టన్నుల రాజ్ మా విత్తనాలను ప్రభుత్వం కేటాయించిందని, ఇంకా ఎక్కువ మంది రైతులకు అవసరం రావడంతో మరో మూడు టన్నులు అదనంగా విత్తనాలను కేటాయించాలని వినతిపత్రంలో కోరినట్లు వారు చెప్పారు. దీంతో సానుకూలంగా స్పందించిన జిల్లా కలెక్టర్ అదనంగా మరో ఒక టన్ను రాజ్ మా విత్తనాలు పంపిణీ చేయడానికి హామీ ఇచ్చినట్లు చెప్పారు. దీంతో పాటు పంచాయతీ పరిధిలోనున్న మొర్రిగూడ గ్రామంలో తారు రోడ్డు పనులు ,అంగన్వాడి భవనం ,హెల్త్ సబ్ సెంటర్ భవనం పనులు పూర్తి చేయాలని వినతిపత్రంలో కోరినట్లు వారు చెప్పారు. మొర్రిగుడ అంగన్వాడి భవనం పూర్తి చేయడానికి రూ 4 లక్షలు మంజూరు చేస్తున్నమని కలెక్టర్ గారు చెప్పినట్లు వారు తెలిపారు. సమస్యలు పరిష్కారానికి సనుకూలంగా స్పందించిన కలెక్టర్ కు వారు కతజ్ఞతలు తెలిపారు.

# జల్‌జీవన్ మిషన్ పనులు ప్రారంభం



పనులు ప్రారంభిస్తున్న నాయకులు

ప్రజాశక్తి- డుంబ్రిగుడ:- మండలంలోని కంద్రుమ్ పంచాయతీ పరిధిలోగల దండగుడ గ్రామంలోని శుక్రవారం మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు, ఆ పంచాయతీ సర్పంచ్ కిముడు హరి జల జీవన్ మిషన్ కార్యక్రమాన్ని లాంఛనగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తాగునీటి వెతలతో బాధలు పడుతున్న గ్రామ గిరిజనులకు దాహార్తిని తీర్చేందుకు వీలుగా జల జీవన్ మిషన్ ద్వారా మంజూరైన రూ 5 లక్షల 50 వేల నిధులతో గ్రామ గిరిజనులకు తాగునీరు కల్పించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకున్నట్లు చెప్పారు. ఈ నేపథ్యంలో గ్రామంలోని బోరు ఏర్పాటు చేస్తున్నామన్నారు. తద్వారా గ్రామంలోని ట్యాంక్ ను ఏర్పాటు చేసి గ్రామంలోని గిరిజనులకు నీటి సరఫరాను అందిస్తామన్నారు. జలజీవన్ మిషన్ ద్వారా ఏర్పాటు చేయనున్న తాగునీటి సౌకర్యాన్ని గ్రామ గిరిజనులు సద్వినియోగ పరచుకోవాలని కోరారు. కాగా నీటి ఎద్దడి నివారణకై సర్పంచ్ హరి తీసుకున్న ప్రత్యేక దష్టి శ్రద్ధ పై గ్రామ గిరిజనులు మహిళలు అభినందించారు. అదేవిధంగా పంచాయతీ పరిధిలోని ఏ గ్రామాల్లో కూడా నీటి ఎద్దడి లేకుండా ప్రత్యేక చర్యలు తీసుకోనున్నట్లు ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో పంచాయితీ వార్డు సభ్యులు జన్ని బలరామ్, గ్రామ వాలంటరీ, గ్రామస్తులు శోభా దశమత్, శోభా గాసి, శోభా భగత్ రామ్,శోభా గంగాధర్, మహిళలు పాల్గొన్నారు.

# నీట్ ర్యాంకర్లకు గీతం బంపర్ ఆఫర్

## ఎంబిబిఎస్‌లో ప్రవేశానికి ఫీజులో భారీ రాయితీ



వివరాలు వెల్లడిస్తున్న గీతం ప్రో విసి గీతాంజలి

ప్రజాశక్తి- మధురవాడ: ప్రతభను ప్రోత్సహించే క్రమంలో ఎంబిబిఎస్‌లో ప్రవేశం పొందేవారికి గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం ఫీజులో భారీ రాయితీతో బంపర్‌ఆఫర్‌ను ప్రకటించింది. శుక్రవారం జిమ్‌సర్ వైద్య కళాశాల ఆసుపత్రిలో విలేకరుల సమావేశంలో ప్రో వైస్‌ఛాన్సలర్ డాక్టర్ బి.గీతాంజలి వివరాలను వెల్లడించారు. ఈ ఏడాది నీట్ అండర్ గ్రాడ్యుయేట్ 2023 పరీక్షలో జాతీయ స్థాయిలో దాదాపు 11.45 లక్షల మంది ఉత్తీర్ణత సాధించారన్నారు. జిమ్‌సర్ వైద్య కళాశాల ద్వారా నీట్ ర్యాంకర్లలో లక్షన్నరలోపు ర్యాంక్ సాధించిన వారికి 50 శాతం మేర ఫీజులో రాయితీని స్కాలర్‌షిప్ రూపంలో తగ్గించనున్నట్లు వెల్లడించారు. అలాగే 3 లక్షల లోపు ర్యాంకు సాధించిన వారికి 25 శాతం, నాలుగున్నర లక్షలలోపు ర్యాంకర్లకు 15 శాతం, 6 లక్షల లోపు ర్యాంకు సాధించిన వారికి 10 శాతం ఫీజు రాయితీ ఉంటుందన్నారు. గీతంలో ప్రవేశం పొందాక ఎంబిబిఎస్ వార్షిక పరీక్షలలో 65 శాతం పైన మార్కులు సాధించిన వారికి ఫీజు రాయితీ కొనసాగిస్తామన్నారు.

గీతంలో 150 ఎంబిబిఎస్ సీట్లకు నేషనల్ మెడికల్ కౌన్సిల్ (ఎన్ఎమ్‌సి) అనుమతి ఇచ్చిందని తెలిపారు. గీతంలో ప్రవేశాలు మెడికల్ కౌన్సిలింగ్ కమిటి నిబంధనలకు అనుగుణంగా ఉంటాయని, ప్రవేశం పొంద గోరే నీట్ ర్యాంకర్లు మెడికల్ కౌన్సిలింగ్ కమిటి పోర్టల్ ద్వారా ముందుగా తమ వివరాలను రిజిస్టర్ చేసుకోవాలన్నారు. జిమ్‌సర్ డీన్ డాక్టర్ ఎస్‌పిరావు, జిమ్‌సర్ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జ్యోతి పద్మజ వైద్య విద్యలో అనుసరిస్తున్న ఉన్నత బోధన, పరిశోధన విధానాలను వివరించారు. అలాగే వైద్య విద్యార్థులకు అధునాతన వైద్య పరికరాలతో శిక్షణ ఇస్తున్నామని తెలిపారు.

## నేత్రదానానికి ముందుకు రావాలి

### - డాక్టర్ రోహిత్ దురేజా

ప్రజాశక్తి - ఆరిలోవ : నేత్రదానానికి ప్రతిఒక్కరూ ముందుకు వచ్చి, కార్నియల్ అంధత్వ నివారణకు సహకరించాలని మోహ్సిన్ నేత్రనిధి అధినేత డాక్టర్ రోహిత్ దురేజా పిలుపునిచ్చారు. మరణానంతరం లోకాన్ని చూసే భాగ్యం నేత్రదానంతోనే కలుగుతుందన్నారు.

38వ జాతీయ నేత్రదాన పక్షోత్సవాలలో భాగంగా శుక్రవారం ఎల్.వి.ప్రసాద్ నేత్ర వైద్యశాల జిఎంఆర్ వరలక్ష్మీ ప్రాంగణంలో ఎల్‌వి ప్రసాద్ నేత్ర వైద్యశాల ఆధ్వర్యంలో నేత్రదానంపై అవగాహన కల్పించారు. పక్షోత్సవాలను ప్రారంభించిన డాక్టర్ రోహిత్ దురేజా మాట్లాడుతూ, కార్నియల్ అంధత్వానికి కార్నియా మార్పిడి మాత్రమే సరైన చికిత్స అని, దీనికి నేత్ర దానం చేయాల్సిన ఆవశ్యత ఎంతైనా ఉందన్నారు.

## ఘాట్ రోడ్డులో వ్యాను బోల్తా



ఘాట్ రోడ్డులో బోల్తా పడిన వ్యాన్

ప్రజాశక్తి- అనంతగిరి: అనంతగిరి టైడా ఘాట్ రెండవ మలుపు వద్ద శుక్రవారం కూర గాయల వ్యాను బోల్తా పడింది. అరకు లోయ మండలంలో శుక్రవారం జరిగిన వారపు సంత నుండి విశాఖ, విజయనగరం మార్కెట్లకు తరలిస్తున్న కూర గాయల వ్యాన్ బ్రేక్ ఫెయిలై రోడ్డు రక్షణ గోడకు ఢీకొని లోయలోకి దూసుకుపోయింది.గాయపడిన బాధితుడిని ఎస్ కోట ప్రభుత్వ ఆసుపత్రికి అంబులెన్స్‌లో తరలించారు.

## రాజ్‌మా విత్తనాల పంపిణీ



రాజ్‌మా విత్తనాలు పంపిణీ చేస్తున్న సర్పంచ్ జ్యోతి, తదితరులు

ప్రజాశక్తి- అరకులోయ:మండలంలోని మాడగడ పంచాయతీలో 90శాతం రాయితీతో రాజ్‌మా విత్తనాలు పంపిణి చేశారు. ఈ రాజ్మ విత్తనాలను ఆ పంచాయతీ సర్పంచ్ మండ్యా కేడ్డి జ్యోతి లబ్ధిదారులకు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, 90 శాతం రాయితీతో రైతులకు పంపిణీ చేస్తున్న విత్తనాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. రైతులందరు వ్యవసాయ శాఖ అధికారులు సూచించిన మెలకువలు, జాగ్రత్తలు శ్రద్ధగా పాటించాలన్నారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి రైతులకు రైతు భరోసా, ఉచిత పంట బీమా పథకం, రైతు భరోసా కేంద్రాల ద్వారా అనేక మెరుగైన మెరుగైన నాణ్యమైన పంట విత్తనాలు, క్రిమి సంహారక మందులు, యంత్రాలు, పనిముట్లు, ట్రాక్టర్లు సబ్సిడీ రాయితీ ధరలతో అందిస్తున్నారని కొనియడారు.ఈ కార్యక్రమంలో వైసిపి మండల నాయకులు మండ్యకేడి బాలరాజు, ఆర్టికల్చర్ రాధాకష్ణ, సచివాలయం కార్యదర్శి చిట్టిబాబు, వార్డుమెంబర్ భవాని, హిందూ, లక్ష్మణ్, పైడన్న, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

అనంతగిరి:రాజ్మా విత్తనాలను మండల కేంద్రంలోని సచివాలయ కేంద్రం వద్ద జెడ్పిటిసి దీసరి. గంగరాజు, ఎంపీపీ శెట్టి. నీలవేణి, సర్పంచ్ సోమ్మెల రూతు చేతుల మీదుగా పంపిణీ చేశారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, అనంతగిరి పంచాయతీ పరిధి 23 పైగా గ్రామాలకు చెందిన 500 మంది రైతులకు సబ్సిడీ కింద రూ 250 చొప్పున రాజ్మా విత్తనాలను అందజేయడం జరిగిందని తెలిపారు.ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి ఎస్ నాగులు, వార్డు మెంబర్ సుబ్బారావు, అగ్రికల్చర్ అసిస్టెంట్. దీపిక, సచివాలయం సిబ్బంది శేఖర్ పాల్గొన్నారు

## బెర్కాడియా సంస్థతో గీతం ఎంఒయు




ఒప్పంద పత్రాలు మార్చుకుంటున్న రెండు సంస్థల ప్రతినిధులు

ప్రజాశక్తి- మధురవాడ : అమెరికా, మెక్సికో, కెనడా, యూరప్, ఇంకా ఆసియా దేశాలలో అతి పెద్ద రియల్ ఎస్టేట్ ఫైనాన్స్ కంపెనీలలో ఒకటైన బెర్కాడియా సంస్థతో గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం శుక్రవారం అవగాహన ఒప్పందాన్ని కుదుర్చుకుంది. ఈ మేరకు గీతం అకడమిక్ ప్రోవైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ జయశంకర్ వారియర్ సమక్షంలో గీతం రిజిస్ట్రార్ ప్రొఫెసర్ డి.గుణశేఖరన్, బెర్కాడియా సర్వీసెస్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ మేనేజింగ్ డైరక్టర్ సుదీప్తో ముఖర్జి ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు. ఎంఒయులో భాగంగా గీతం స్కూల్ ఆఫ్ టెక్నాలజీ, గీతం స్కూల్ ఆఫ్ బిజినెస్ విద్యార్థులకు ఇంటర్న్‌షిప్‌లు, ప్రాంగణ నియామకాలలో సహకారంతో పాటు నిపుణులతో ప్రసంగాలను ఏర్పాటు చేయనున్నారు. అధ్యాపకులకు ఫ్యాకల్టీ డవలప్‌మెంట్ ప్రోగ్రామ్ నిర్వహించాలని నిర్ణయించారు. ఈ సందర్భంగా గీతం అకడమిక్ ప్రోవైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ జయశంకర్ వారియర్ మాట్లాడుతూ విద్యాలయాలకు పరిశ్రమలకు మధ్య మెరుగైన సంబంధాల ద్వారా యువత నైపుణ్యం పెరుగుతుందన్నారు. గీతం విశ్వవిద్యాలయం ఇప్పటికే పలు పరిశ్రమలతో అవగాహన ఒప్పందాలను కుదుర్చుకుందని తెలిపారు. ర్యక్రమంలో భాగంగా గీతం స్కూల్ ఆఫ్ బిజినెస్ విద్యార్థులతో బెర్కాడియా సర్వీసెస్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ మేనేజింగ్ డైరక్టర్ సుదీప్తో ముఖర్జి ముఖాముఖి కార్యక్రమాన్ని నిర్వహించారు. గీతం కెరీర్ గైడెన్స్ సెంటర్ డైరక్టర్ వంశీకిరణ్ సోమయాజుల పాల్గొన్నారు.

## కబ్జాల చిట్టా చేతిలో ఉన్నా నేలచూపులా..

### - రూ.వందల కోట్ల విలువైన భూములపై జివిఎంసి, రెవెన్యూ అశ్రద్ధ

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

'ప్రభుత్వ భూములు, గ్రామ కంఠాలు, చెరువులు, గెడ్డలు, నీటి కుంటలు, శ్మశానాలు తదితర వాటిలో జరిగిన అక్రమ, అనధికార నిర్మాణాలను కూల్చేయాల్సిందే..' - హైకోర్టు 2022 సెప్టెంబర్ 14న జారీ చేసిన ఉత్తర్వుల సారాంశమిది. ఒకవేళ 30 ఏళ్లు దాటితే వాటిని క్రమబద్ధీకరించి నేడున్న ధరలకు తగ్గట్టుగా పెనాల్టీలు వేయాల్సిందేనని ఆ ఉత్తర్వుల్లో వెల్లడించినా రెవెన్యూ, జివిఎంసి యంత్రాంగంలో కదలిక లేదు. భూ కబ్జాలు, దురాక్రమణల వైపు కన్నెత్తి కూడా చూడడం లేదు. భూ కుంభకోణాలు, ట్యాంపరింగులపై గత టిడిపి ప్రభుత్వం వేసిన ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని తొక్కిపట్టేసి కొత్తగా సిట్ వేసిన వైసిపి తమ నివేదికనూ బయటపెట్టకుండా నేలచూపులు చూడడం విశాఖలో విడ్డూరం.

**భూ దురాక్రమణల చిట్టా ఇదే..**

నగరంలో గాజువాక, పెందుర్తి, మధురవాడ, రుషికొండ, సాగర్‌నగర్, ఎండాడ ఇలా ఎక్కడ చూసినా ప్రభుత్వ భూములు, గ్రామ కంఠాలు, చెరువులు, గెడ్డలు దురాక్రమణకు గురయ్యాయి. ప్రజావసరాలకు ఉపయోగించే పార్కులు, ప్రజోపయోగ ప్రభుత్వ భూములు ఎక్కడ ఆక్రమణలకు గురైనా ఆయా ప్రభుత్వ శాఖలు కలుగజేసుకుని వాటిని స్వాధీనం చేసుకోవాలని హైకోర్టు ఆర్డర్ వేసినప్పటికీ రెవెన్యూ ఉన్నతాధికారులు మిన్నకుండిపోతున్నారు. ఎండాడ, సాగర్‌నగర్‌లో 57 నుంచి 62 సర్వే నెంబర్ల వరకూ, 122 నుంచి 125 వరకూ, 100 అలాగే 150 సర్వే నెంబర్లలో వంద ఎకరాల ప్రభుత్వ గెడ్డలు దురాక్రమణదారుల చేతుల్లో ఉన్నాయి. సర్వే నెంబరు 57/2లో సుమారు 6 ఎకరాలకు సంబంధించి ప్రభుత్వం కోర్టులో కేసు వేసి తమ భూమిగా గెలుచుకున్నా కబ్జాదారులు ఇంకా దీన్ని విడువడం లేదు. ప్రభుత్వం నిర్మించిన గోడను కూడా వీళ్లు బద్దలు కొట్టిన పరిస్థితి సాగర్‌నగర్ ప్రాంతంలో ఉంది. సర్వే నెంబరు 118లో 46 ఎకరాల ప్రభుత్వ భూమి దురాక్రమణకు గురైంది. సర్వే నెంబరు 29/1, 29/2లో సుమారుగా ఆరు ఎకరాలు కబ్జాకు గురైంది. దురాక్రమణదారుడు రుషికొండలో పెత్తందారుకావడం, వైసిపి తీర్థం పుచ్చుకోవడంతో రెవెన్యూ, స్థానిక ఎంఎల్ఎ సదరు వ్యక్తిని కాపాడుతున్నారన్న చర్చ రుషికొండ ప్రాంతంలో జోరుగా సాగుతోంది. రాజధాని ప్రాంతమైన విశాఖ సాగర తీరంలో పాదం మోపేటంత భూమిని కూడా కబ్జా కానివ్వమంటూ వైసిపి పెద్దలంతా చెబుతున్నా వాస్తవం దానికి భిన్నంగా ఉంది. జివిఎంసి, రెవెన్యూ యంత్రాంగం వద్ద కబ్జాల లెక్కలు, వివరాలన్నీ ఆధారాలతో సహా ఉన్నా చర్యలు తీసుకోవడంలో వెనుకాడుతున్నాయి.

## సైబర్ నేరగాళ్లతో జాగ్రత్త సుమా..

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : విశాఖ నగర ప్రజలు సైబర్ నేరగాళ్ల పట్ల అప్రమత్తంగా ఉండాలని, ఇటీవల కాలంలో కొందరు చిన్నచిన్న మొత్తాల కోసం ఇన్‌స్టంట్ లోన్ యాప్‌లపై ఆధారపడుతూ.. అనంతరం జరిగే పరిణామాలతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని నగర పోలీస్ కమిషనర్ సిఎం.త్రివిక్రమ వర్మ తెలిపారు. శుక్రవారం సాయంత్రం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆన్‌లైన్‌లో ఎటువంటి హామీ లేకుండా తక్కువ మొత్తంలో సులువుగా లోన్లు ఇస్తూ అధిక వసూళ్లకు పాల్పడుతున్న ముఠాలు ఎక్కువయ్యాయన్నారు. సోషల్ మీడియాలో ప్రకటనలు ఇస్తూ వాటిపై క్లిక్ చేసిన వెంటనే బాధితుల పూర్తి వివరాలు చేజిక్కించుకుని అనంతరం మానసికంగా వేధిస్తుంటాయని తెలిపారు.

**కంచరపాలెం ఘటన ఓ ఉదాహరణ**

'నగరంలోని కంచరపాలెం ప్రాంతానికి చెందిన గున్న హేమంత్ ఓ యాప్ ద్వారా చిన్న మొత్తాల్లో లోన్లు తీసుకొని కొంత మొత్తం తిరిగి చెల్లించాడు. అయినప్పటికీ ఇంకా ఎక్కువ మొత్తంలో డబ్బు కట్టాలని, కట్టిన డబ్బులు ఇంకా తమకు అందలేదని వివిధ రూపాల్లో అతన్ని సదరు యాప్ నిర్వాహకులు వేధించారు. అతని ఫొటోలను మార్ఫింగ్ చేసి అందరికీ పంపించారు. దీంతో తీవ్ర మనస్తాపానికి గురైన యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు' అని సిపి తెలిపారు. ఈ కేసులో అతని తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించామని, అనంతపురానికి చెందిన చీమల సుబ్బరామిరెడ్డిని, ఒడిశాకు చెందిన దిలీప్ కుమార్ పాత్రోను అరెస్టు చేశామని వెల్లడించారు. ఈ కేసులో అసలు నిందితులు మలేషియా నుంచి పనిచేస్తున్నారని తెలిపారు. వారిని అరెస్ట్ చేసేందుకు కేంద్ర ప్రభుత్వంతో సంప్రదింపులు జరుపుతున్నామని అన్నారు.

**ఉద్యోగాల పేరిట..**

నగరానికి చెందిన ఇద్దరు పార్ట్ టైం జాబ్స్ పేరిట ఒకరు రూ.22 లక్షలు, మరొకరు రూ.7.5 లక్షలు నష్టపోయారని సిపి తెలిపారు. వారిని ఆన్‌లైన్‌లో ఎదుటవారు ఎలా మోసం చేశారో వివరించారు.

# సగం పనులే..

### - అసంపూర్తిగా సచివాలయ, రైతు భరోసా, ఆరోగ్య కేంద్ర భవనాలు
### - వెంటాడుతున్న నిధుల సమస్య
### - 1972 భవనాలకు 769 మాత్రమే పూర్తి



అసంపూర్తిగా పప్పుశెట్టిపాలెం సచివాలయ భవనం

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి, నర్సీపట్నం, అచ్యుతాపురం విలేకరులు

ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలో నిధుల సమస్యతో గ్రామ సచివాలయ, రైతు భరోసా కేంద్రాలు, వైఎస్ఆర్ ఆరోగ్య కేంద్రాల భవన నిర్మాణ పనుల్లో జాప్యం చోటుచేసుకుంటోంది. ప్రభుత్వ పదవీకాలం పూర్తయ్యేలోపు పనులు అయ్యేలా కనిపించడంలేదు. 2019-20లో భవన నిర్మాణాలకు పరిపాలనా ఆమోదం లభించినా నిధుల కొరతతో సకాలంలో నిర్మాణ పనులు పూర్తిచేయలేని పరిస్థితి ఏర్పడింది. పనులు పూర్తిచేశాక బిల్లు పెట్టిన మూడు నెలలకు కూడా డబ్బులు రాకపోవడంతో పెట్టుబడి పెట్టుకోలేక కాంట్రాక్టర్లు పనులు నిలిపివేశారు. ప్రభుత్వ యంత్రాంగం నుంచి ఎంత ఒత్తిడివున్నా నిర్మాణ పనులు పూర్తిచేయడానికి కాంట్రాక్టర్లు ఆసక్తి చూపలేదు. దీంతో మంజూరైన పనుల్లో భవన నిర్మాణ పనులు సగం కూడా పూర్తికాలేదు. జిల్లాలో రూ.508.50 కోట్లతో 1972 భవన నిర్మాణాలు పూర్తిచేయాల్సివుంది. కానీ ఇంతవరకు రూ.251.79 కోట్లు ఖర్చుచేసి 769 భవన నిర్మాణ పనులు మాత్రమే పూర్తిచేశారు. మిగిలిన పనులు వివిధ స్థాయిల్లో ఉన్నాయి. నిధుల సమస్యకు తోడు ఇసుక సమస్య తోడవడంతో నిర్మాణ పనులను అనుకున్న సమయానికి పూర్తిచేయలేకపోతున్నట్లు కాంట్రాక్టర్లు చెబుతున్నారు. పాడేరు ఏజెన్సీలో ఈ సమస్య మరింత ఎక్కువగా వుంది. మైదానం నుంచి నిర్మాణ సామగ్రి తీసుకెళ్లడం వల్ల రవాణా ఖర్చులు ఎక్కువకావడంతో పనులపై కాంట్రాక్టర్లు ఆసక్తిచూపడంలేదు. నిర్మాణ ఖర్చులు పెరగడంతో పాత ధరల ప్రకారం పనులు చేయలేమని కొంతకాలం కాంట్రాక్టర్లు పనులు చేసేందుకు వెనుకడుగువేశారు. ఏజెన్సీలో ఈ సమస్య వల్ల పనుల్లో జాప్యం చోటుచేసుకుంది.

ఉమ్మడి విశాఖ జిల్లాలో రూ.260.57 కోట్ల వ్యయంతో 728 గ్రామ సచివాలయ భవనాలు పూర్తికావాల్సి ఉండగా ఇప్పటికి 402 భవన నిర్మాణ పనులు పూర్తయ్యాయి. మరో 326 భవనాల పనులు వివిధ దశల్లో ఉన్నాయి. ఈ పనులకు రూ.143.41 కోట్లు ఖర్చయింది. రైతు భరోసా కేంద్రాలకు సంబంధించి రూ.152.91 కోట్ల వ్యయంతో 701 భవనాలు పూర్తిచేయాల్సివుండగా, ఇంతవరకూ రూ.66.85 కోట్లు ఖర్చుచేసి 241 పనులు పూర్తిచేశారు. మరో 456 పనులు వివిధ స్థాయిల్లో వున్నాయి. అసలింతవరకు నాలుగు భవనాల పనులను ప్రారంభించలేదు. రూ.95.02 కోట్ల వ్యయంతో 543 వైఎస్ఆర్ ఆరోగ్య కేంద్ర భవన నిర్మాణాలు పూర్తిచేయాల్సివుండగా రూ.41.53 కోట్లు ఖర్చుచేసి 126 భవన నిర్మాణ పనులు పూర్తిచేశారు. 414 పనులు ప్రగతిలో వున్నాయి. వివిధ కారణాలతో 43 వైఎస్ఆర్ ఆరోగ్య కేంద్రాల భవన నిర్మాణ పనులు ప్రారంభించలేదు. అనకాపల్లి జిల్లా గొలుగొండ మండలం పప్పుశెట్టిపాలెంలో బిల్లులు అవ్వక సచివాలయ భవనం పనులను అసంపూర్తిగా కాంట్రాక్టర్ నిలిపేశాడు. మాకవరపాలెం మండలం గిడుతూరులో రెండేళ్ల క్రితం ప్రారంభించిన రైతు భరోసా కేంద్రం పనులు ధరలు పెరగడంతో మధ్యలో ఆపేశారు. అచ్యుతాపురం మండలం తిమ్మరాజుపేటలో రైతు భరోసా కేంద్రం, గ్రామ సచివాలయ పనులు పూర్తికాలేదు.

**అధికారులు ఏం చెబుతున్నారంటే..**

ఇంతవరకూ నెలకొన్న నిర్మాణ జాప్యాన్ని తొలగించేందుకు పంచాయతీరాజ్ శాఖకు ప్రభుత్వం లక్ష్యం విధించింది. దీంతో సెప్టెంబరు నాటికి ప్రస్తుత విశాఖపట్నం, అనకాపల్లి జిల్లాల్లోని సచివాలయ, రైతు భరోసా, వైఎస్ఆర్ ఆరోగ్య కేంద్రాల భవనాలు పూర్తిచేయనున్నామని పంచాయతీరాజ్ శాఖాధికారులు చెబుతున్నారు. ఇప్పుడు బిల్లుల సమస్య లేకపోవడంతో నిర్మాణాలు వేగవంతమవుతున్నాయని అంటున్నారు. బిల్లు పెట్టిన వారానికి కాంట్రాక్టర్లకు డబ్బులు జమకావడంతో నిర్దేశిత కాలంలో భవన నిర్మాణ పనులు పూర్తిచేయిస్తామని చెబుతున్నారు. పాడేరు డివిజన్‌లో భవన నిర్మాణాలను డిసెంబరు నాటికి పూర్తి చేయనున్నట్లు తెలిపారు.



తిమ్మరాజుపేటలో అసంపూర్తిగా రైతు భరోసా కేంద్రం

### అగనంపూడి టోల్‌గేట్ తొలగించాలని..

# ఎంపీకి సిపిఎం కార్పొరేటర్ వినతి

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : అగనంపూడి టోల్‌గేట్‌ను వెంటనే తొలగించాలంటూ విశాఖ ఎంపీ ఎంవివి.సత్యనారాయణకు సిపిఎం 78వ వార్డు కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు శుక్రవారం ఉదయం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గడువు అయిపోయినా టోల్‌గేట్‌ను తొలగించకుండా ప్రజలను, వాహనదారులను నిలువ దోపిడీ చేయడం దారుణమన్నారు. ఆనందపురం - సబ్బవరం - అనకాపల్లి అరు లైన్ల రోడ్డు నిర్మాణం పూర్తయిన వెంటనే అగనంపూడి టోల్‌గేట్ తొలగిస్తామని సుప్రీం కోర్టులో నేషనల్ హైవే సంస్థ హామీ ఇచ్చి దాన్ని ఉల్లంఘించిందని గంగారావు ఎంపీ ఎంవివికి తెలియజేశారు. జివిఎంసి పరిధిలో టోల్‌గేట్ ఉండకూడదని అన్నారు. ఈ విషయమై జివిఎంసి కౌన్సిల్‌లో కూడా టోల్‌గేట్ తొలగించాలని గత ఏడాది ఏకగ్రీవ తీర్మానం చేసిన విషయాన్ని గుర్తుచేశారు. ఎంపీని కలిసిన వారిలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఆర్‌కెఎస్‌వి.కుమార్ ఉన్నారు.

**కలెక్టర్‌కు సిపిఐ విజ్ఞప్తి**

కలెక్టరేట్ : అగనంపూడి టోల్‌గేట్‌ను తక్షణమే తొలగించాలని శుక్రవారం జిల్లా కలెక్టర్ మల్లికార్జునకు, జివిఎంసి కమిషనర్ సాయికాంత్‌వర్మకు సిపిఐ జిల్లా కార్యదర్శి మరుపిళ్ల పైడిరాజు మెయిల్ ద్వారా వినతిపత్రాలు పంపించారు.



సిఎం జగన్‌కు స్వాగతం పలికేందుకు వచ్చిన కెకె.రాజు, సుబ్బారెడ్డి తదితరులు

## సిఎం జగన్‌కు ఘన స్వాగతం, వీడ్కోలు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖర్ రెడ్డి విజయనగరం జిల్లా చినమేడపల్లి గ్రామంలో సెంట్రల్ ట్రైబల్ యూనివర్సిటీ శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొనేందుకు శుక్రవారం ఉదయం ప్రత్యేక విమానంలో విజయవాడ నుంచి విశాఖ విమానాశ్రయానికి రాగా అతనికి ఘన స్వాగతం లభించింది. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, పంచాయతీరాజ్ శాఖ మంత్రి బూడి ముత్యాలనాయుడు, పరిశ్రమలు, ఐటి కమ్యూనికేషన్ శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, టిటిడి మాజీ చైర్మన్ వైవి.సుబ్బారెడ్డి, ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ, ఎంపీలు ఎంవివి.సత్యనారాయణ, బి.సత్యవతి, మేయర్ గొలగాని హరి వెంకట కుమారి, డిసిసిబి చైర్మన్ కోలా గురువులు, జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున, పోలీస్ కమిషనర్ త్రివిక్రమ్ వర్మ, జివిఎంసి కమిషనర్ సాయి కాంత్ వర్మ, జాయింట్ కలెక్టర్ కెఎస్.విశ్వనాథన్, ఆర్‌డిఒ హుస్సేన్ సాహెబ్ తదితరులు పుష్పగుచ్ఛాలు అందజేసి ముఖ్యమంత్రికి ఘన స్వాగతం పలికారు. అనంతరం సిఎం ప్రత్యేక హెలికాప్టర్‌లో ఉదయం 10.20 గంటలకు విజయనగరం జిల్లాకు బయలుదేరారు.

అలాగే విజయనగరం పర్యటన ముగించుకొని ప్రత్యేక హెలికాప్టర్‌లో తిరిగి మధ్యాహ్నం 1.40 గంటలకు సిఎం విశాఖ విమానాశ్రయానికి చేరుకున్నారు. ఆయనకు అందరూ ఆత్మీయ వీడ్కోలు పలికారు. నెడ్ క్యాప్ చైర్మన్ కెకె.రాజు, ఎమ్మెల్సీలు వరుదు కల్యాణి, వంశీకృష్ణ శ్రీనివాస్ యాదవ్, ఎమ్మెల్యేలు తిప్పల నాగిరెడ్డి, కన్నబాబు రాజు, వాసుపల్లి గణేష్ కుమార్, అదీప్‌రాజు, ఉమా శంకర్ గణేష్, తదితరులు వీడ్కోలు పలికిన వారిలో ఉన్నారు. అనంతరం ముఖ్యమంత్రి 2.45 గంటలకు ప్రత్యేక విమానంలో విజయవాడకు తిరుగు పయనమయ్యారు. ముఖ్యమంత్రి వెంట టిటిడి మాజీ చైర్మన్ వైవి.సుబ్బారెడ్డి, ఎమ్మెల్సీ తలశిల రఘురాం, సిఎంఒ జాయింట్ సెక్రటరీ భరత్ గుప్తా, సిఎం పిఎ కె.నాగేశ్వరరెడ్డి ఉన్నారు.

## రికార్డు స్థాయిలో బజాజ్ ఫైనాన్స్ ఫిక్సిడ్ డిపాజిట్లు

ప్రజాశక్తి - కలెక్టరేట్ : దేశంలోని నాన్-బ్యాంకింగ్ ఫైనాన్స్ కంపెనీల్లో ఒకటైన బజాజ్ ఫిన్‌సర్వ్‌లో భాగమైన బజాజ్ ఫైనాన్స్ లిమిటెడ్ తమ ఫిక్సిడ్ డిపాజిట్ల ఖాతాకు సంబంధించి రూ.50 వేల కోట్ల మైలురాయిని దాటినట్టు బజాజ్ ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్, ఫిక్సిడ్ డిపాజిట్స్, ఎఎంపి, ఇన్వెస్ట్‌మెంట్స్ బాధ్యులు సచిన్ సిక్కా తెలిపారు. నగరంలోని ఓ హోటల్‌లో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ బజాజ్ ఫైనాన్స్‌కు ఐదు లక్షల మందికిపైగా వినియోగదారులు ఉన్నారన్నారు. ఈ ఏడాది జూన్ 30కి సంఘటిత రుణాల్లో డిపాజిట్లు 21 శాతం, స్వతంత్ర రుణాల్లో 28 శాతం ఉన్నాయని తెలిపారు.

క్రిసిల్, ఐసిఆర్ఎ, కేర్, ఇండియన్ రేటింగ్స్ ద్వారా తమ దీర్ఘకాలిక రుణ కార్యక్రమం నిమిత్తం అత్యున్నతమైన ఎఎఎ, స్టేబుల్ క్రెడిట్ రేటింగ్‌ను బజాజ్ ఫైనాన్స్ కలిగి ఉందన్నారు. ఆకర్షణీయమైన వడ్డీ రేట్లతో తమ వినియోగదారులకు దీర్ఘకాలిక పొదుపు పరిష్కారాలను అందించడంపై దృష్టి కేంద్రీకరించామని తెలిపారు. పదేళ్ల కాలంలో కంపెనీ తన డిపాజిట్ ఖాతాల్లో సిఎజిఆర్ వద్ద 60 శాతం, డిపాజిటర్ల సంఖ్యలో సిఎజిఆర్ వద్ద 49 శాతానికి ఎదిగిందన్నారు.

## అల్లు అర్జున్‌ను కలిసిన దిలీప్ బైరా

ప్రజాశక్తి - విశాఖపట్నం : జాతీయ ఉత్తమ నటుని అవార్డు దక్కించుకున్న తొలి తెలుగు నటునిగా చరిత్ర సృష్టించిన అల్లు అర్జున్‌ను బైరా ఫౌండేషన్ తెలుగు రాష్ట్రాల అధ్యక్షులు దిలీప్ సి బైరా హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా సన్మానించారు. అల్లు అర్జున్‌ను కలిసిన వారిలో మాజీ మంత్రి, విశాఖ ఉత్తర నియోజకవర్గం ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు కూడా ఉన్నారు.